పల్లె మనుగడకు ముసలం

- నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- చీరాల నియోజకవర్గంలో 23 గ్రామ పంచాయతీల్లో నిలిచిన ఎన్నికలు
- పంచాయతీల పునర్విభజనపై హైకోర్టులో కేసులు వేసిన నాటి టీడీపీ నేతలు


వేటపాలెం గ్రామ పంచాయతీ వ్యూ

వేటపాలెం: పల్లె ప్రగతి పాతాళంలోకి వెళుతోంది. ఎక్కడికక్కడ సమస్యలు చుట్టు ముడుతున్నా వాటి పరిష్కారానికి మార్గం కనిపించడం లేదు. తాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. చీకటి పడితే గ్రామాలన్నీ అంధకారంలోకి వెళ్లాల్సిందే. మురుగు ఓ వైపు, వర్షాకాలంలో బ్లీచింగ్, క్లోరిన్ వంటివి లేక.. ముంచుకొస్తున్న వ్యాధులు మరో వైపు. ఇలాంటి దుస్థితి చీరాల నియోజవర్గంలో నెలకొంది. చీరాల రూరల్ మండలం పరిధిలో 15 గ్రామ పంచాయతీలుండగా వాటికి అనుగుణంగా 20 హేమ్‌లెట్ గ్రామాలున్నాయి. ఇందులో ఈపురుపాలెం, గవినివారిపాలెం, ఓడరేవు, దేవాంగపురి వంటి మేజర్ పంచాయతీలున్నాయి. ఒక్కో గ్రామ పరిధిలో 15 వేలకు పైగా జనాభా ఉంటారు. వేటపాలెం మండల పరిధిలో మొత్తం తొమ్మిది గ్రామ పంచాయతీలుండగా వేటపాలెం, దేశాయిపేట, కొత్తపేట, వంటి మేజర్ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 16 హేమ్‌లెట్ గ్రామాలున్నాయి. వీటి పరిధిలో కూడా 10 నుంచి 15 వరకు జనాభా ఉంటారు. చీరాల నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని గ్రామాలు ఒకదానికి ఒకటి కలిసిపోయి ఉండటం విశేషం.

ఐదేళ్లుగా ఎన్నికలు నిల్

రాష్ట్ర వ్యాప్తంగా 2021 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించారు. అయితే చీరాల నియోజవర్గ పరిధిలోని చీరాల రూరల్, వేటపాలెం మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో 23 గ్రామ పంచాయతీలకు ఐదేళ్లగా పంచాయతీ ఎన్నికలు జరగలేదు. అయితే రామన్నపేట పంచాయతీకీ మాత్రమే జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మిగిలిన చోట్ల ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. చీరాల రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగాయి. కొత్తగా రెండు గ్రామ పంచాయతీలకు ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా వేటపాలెం మండలంలో ఉన్న తొమ్మిది గ్రామ పంచాయతీలను పునర్వి భజన చేసి అదనంగా మరో మూడు పంచాయతీలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటిలో ఇది గిట్టని టీడీపీ నాయకులు పునర్విభజనపై హైకోర్టులో 2020లో కేసులు వేశారు. దీంతో గ్రామ పంచాయతీలకు జరగాల్సిన ఎన్నిలు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నుల ద్వారా, వ్యాపార సంస్థల ద్వారా ప్రధానంగా ఆదాయ వనరులు వస్తుంటాయి. వీటి ద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు, వీధి దీపాలు, స్టేషనరీ వంటి వాటి కొనుగోలుకు మాత్రమే సరిపోతుంటాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే పంచవర్ష ప్రణాళిక నిధుల ద్వారానే అభివృద్ధి పనులు జరగాల్సి ఉంటుంది.

నిలిచిన నిధులు

పంచాయతీల ఎన్నికల జరగక పోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచి పోయాయి. కేవలం 2020–21 సంవత్సరానికి విడుదల చేశారు. మిగిలిన నాలుగేళ్లల్లో ఒక్క రూపాయి కూడా రాలేదు. 22 పంచాయతీలకు కలిపి దాదాపు రూ. 25 కోట్ల నిధులు ఆగిపోయాయి. ఇలా టీడీపీ నాయకులు చేసిన పనికి 22 గ్రామ పంచాయతీలు ఐదేళ్లగా అభివృద్ధికి నోచుకోకుండా మురికి కూపంలోనే ఉండి పోయాయి. ఐదేళ్లగా ఎన్నికలకు నోచుకోకుండా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగు తున్నాయి. రానున్న పంచాయతీ ఎన్నికల నాటికైనా కోర్టు కేసులు కొలిక్కివస్తాయా లేదా అని ప్రజలు విమర్శిస్తున్నారు. హైకోర్టులో కేసులు వేసిన వారు ఇప్పటికైనా వాపసు తీసుకుంటారా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పొగాకు ప్రత్యామ్నాయ పంటలు మేలు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి కుమారి


కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ ధనరాజ్


నక్కబొక్కలపాడులో మాట్లాడుతున్న ఏడీ

పర్చూరు: రైతులు పొగాకు సాగును గణనీయంగా తగ్గించి లాభదాయకంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలైన పత్తి, మొక్కజొన్న, అపరాలు వంటివి సాగు చేయాలని మండల వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాజుపాలెం దేగరమూడి రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏఓ రామినేని లావణ్యతో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం పొగాకు నిల్వలు కలిగి ఉన్న రైతులు, అధికారులు షెడ్యూల్ ఇచ్చి మ్యాప్ చేసిన గోడౌన్ కు మాత్రమే తరలించుకు వెళ్లాలని కోరారు. ఏవో లావణ్య మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు వీఆర్వో దగ్గర తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి బి హనుమంతు నాయక్ మాట్లాడుతూ మార్టూరు మండలంలో పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం హెక్టారుకు 42,000 రూపాయలు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రుతుపవనాల రాకకు ముందు రైతులు పీఎండీఎస్ కిట్లు వాడకం వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రకృతి వ్యవసాయ మండల అధికారి రాజశేఖర్ తెలిపారు. ఏఈఓ రాధాకృష్ణ, వీఏఏ దీక్షిత్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతు హక్కు పత్రం అవసరం

ఇంకొల్లు(చినగంజాం): కౌలు రైతులు తప్పని సరిగా కౌలు రైతు హక్కు పత్రం కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఇడుపులపాడు, గొల్లపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలచౌడు, కారు చౌడు నేలలను శుద్ధి చేసుకునే విధానాలను గురించి ఆమె తెలియజేశారు. వ్యవసాయ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

నల్లబర్లీ అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

బల్లికురవ: నల్లబర్లీ పొగాకు సాగుచేసిన రైతు అధైర్య పడవద్దని చివరి ఆకువరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలోని 20 రైతు సేవాకేంద్రాల్లో 430 మంది రైతులు పొగాకు అమ్మకాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని ఇంకా చేసుకోవాల్సి టుంటే సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రకారం కొనుగోళ్లకు సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని మొదటిగ్రేడు క్వింటాళ్లకు రూ. 2 వేలు, రెండో గ్రేడ్ రూ. 6 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో ఏఈవో మౌలాలి, వీఏఏలు లక్ష్మణ్, సుభాని పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవతో ఉపయోగం

మేదరమెట్ల: కొరిశపాడు, పి.గుడిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధన్‌రాజ్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను గురించి ఈ పథకం ద్వారా లబ్ధిపొందే లబ్ధిదారుల వివరాలను గ్రామ రైతు సేవా సిబ్బంది ద్వారా తెలుసుకోవచ్చన్నారు. భూమిలేని కౌలు రైతులు కూడా ఈ పథకానికి అర్హులన్నారు. నల్ల బర్లీ పొగాకును నాణ్యతను బట్టి రూ.6 వేల నుంచి రూ.12వేల వరకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కొరిశపాడు మండలంలో కూడా త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఏవో రామ్మోహన్‌రెడ్డి, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

యద్దనపూడి: కాలానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారించాలని యద్దనపూడి వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వింజనంపాడు, చిమటవారిపాలెం గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కువ కాలం ఒకే రకమైన పంటసాగుకు స్వస్తి పలికి పంట మార్పిడికి శ్రీకారం చుట్టాలన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా పత్తి, కంది, మినుము, మొక్కజొన్న పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రతి పంటకు రక్షణ కవచంగా జొన్న, సజ్జ, ఆముదం వంటి పంటలను సాగు చేయాలన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను తగ్గించి సేంద్రియ ఎరువులను, కషాయాలను వినియోగించుకొని పంటల పెట్టుబడి తగ్గించుకోవాలన్నారు. వీఏఏలు సుదర్శన, లీలా సత్య , స్థానిక రైతులు పాల్గొన్నారు.


ఇంకొల్లు: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మేరిమ్మ


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఉన్నత విద్యతో ఉన్నత భవిత

కారంచేడు: శ్రద్ధగా చదువుకొని మంచి ప్రయోజకులుగా మారాలని మాజీ మంత్రి, పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు వైఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ పాఠశాలలో చదివిన అనేక మంది మంచి డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, రాజకీయవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా, సినీ ప్రముఖులుగా దేశ, విదేశాల్లో ఎంతో మంది స్థిరపడ్డారన్నారు. ఈ తరంలోని మీరు కూడా మంచిగా చదువుకుంటూ మీ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి తాళ్లూరి సునీల్ చౌదరి మాట్లాడుతూ కృషి, పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవడంలో ఎక్కువ ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కారంచేడు వైఎస్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ దగ్గుబాటి, మాజీ న్యాయమూర్తి సునీల్ చౌదరి

4105 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు

బల్లికురవ: మండలంలోని 59 పాఠశాలలోని 1 నుంచి 10 వ తరగతి చదువుతున్న 4105 మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకానుక కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కె. రమేష్‌బాబు బుధవారం తెలిపారు. 9 ఫౌండేషన్ పాఠశాలలు 19 బేసిక్ పాఠశాలలు, 9 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలలు, ఒక ఏజీబీవీ లోని విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. 166 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా 162 మంది విధుల్లో ఉన్నారని బడిఈడు కలిగిన బాలబాలికలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతానికి విద్యావేత్తలు, పూర్వవిద్యార్థులు, గ్రామస్థాయి నాయకులు కృషి చేయాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

కారంచేడు: గత ఆరు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లుగా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించడంతో పాటు బీఎల్‌ఓ విధులను సైతం నిర్వహిస్తున్నా.. పదోన్నతులు కల్పించలేదని మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె. నేతాజీని కలిసి వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకిలో విద్యుత్ టవర్ల పనుల కారణంగా స్థానిక దామావారిపాలెం, నరసరావుపేట రోడ్ పెద్ద మసీదు సెంటర్, భవాని సెంటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణవాసులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వేటపాలెం: వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సీడీపీఓ ఝాన్సీ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ ఆయాకు ఏడో తరగతి ఉత్తీర్ణత చెంది.. ఆ గ్రామ పరిధిలో నివాసం కలిగి ఉండాలని తెలిపారు. జూలై 1వ తేదీ నాటికి అభ్యర్థి వయస్సు 21వ నిండి 35 లోపు ఉండాలని.. జూలై 05 వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. చీరాల బీ సెక్టార్ చీరాల మున్సిపాలిటీ పరిధిలోని అరిటి ఆకుల నగర్ కోడ్ నెంబర్ 0802066లో గల కేంద్రంలో (ఎస్టీ), వీఎస్ఆర్ పరిధిలో 080277 కోడ్ నెంబర్ అంగన్‌వాడీ పరిధిలో (ఓసీ)కు కేటాయించామని చెప్పారు.

కారంచేడు: మండలంలోని కేశవరప్పాడు 0813126 కోడ్ సెంటర్‌లోని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేశామని సీడీపీఓ జి. సులోచనారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కారంచేడు మండలంలో కేశవరప్పాడు (జనరల్)కు కేటాయించామన్నారు.

ఏపీఎం సుబ్బారావుకు అభినందనలు


వెలుగు ఏపీఎం సుబ్బారావును అభినందిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

చినగంజాం: వెలుగు ఏపీఎం సుబ్బారావును కలెక్టర్ జె. వెంకట మురళి అభినందించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఎంల సమీక్ష సమావేశంలో ఆయన అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యఘర్, పీ4 సర్వే, దివ్యాంగుల సంక్షేమం కోసం చేసిన కార్యక్రమాల్లో ఉత్తమ విధులు నిర్వహించినందుకు గాను సుబ్బారావుకు శాలువా కప్పి సత్కరించి.. ప్రశంసలు అందజేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, ఎంపీడీఓలు, ఏపీఎంఎస్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక


శ్రీ నాగ తేజ


బాల మణికంఠ

మార్టూరు: కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలలకు ఎంపికయ్యారు. గాలి శ్రీ నాగ తేజ ఇడుపులపాయ, వల్లెపు బాల మణికంఠ ఒంగోలులో ప్రవేశాలు పొందినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ ఎం. సతీష్ కుమార్, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మాదిగల సమాజ అభ్యున్నతికి కృషి


ఇంకొల్లులో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య

ఇంకొల్లు(చినగంజాం): మాదిగల సమాజ అభ్యున్నతికి అంతా కృషి చేసి జాతిని ముందుకు నడిపించాలని ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య పిలుపు నిచ్చారు. పర్చూరు నియోజక వర్గం ఇంకొల్లు మండల సమావేశం ఇంకొల్లు స్టాలిన్ పేటలో బుధవారం నిర్వహించారు. ఎంఎస్పీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెపోగు నాని అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య పాల్గొని మాట్లాడారు. జూలై 7వ తేదీన నిర్వహించే ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో ఇంకొల్లు మండలంలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ 30 ఏళ్ళుగా సాధించిన లక్ష్యాలు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్, రేషన్ బియ్యం కోటా పెంపు, ఆరోగ్య శ్రీ సాధించిన ఘనత సమాజంలో వెనుక బాటు తనానికి గురైన ప్రతి కులం వెనుక నిలిచిన ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. మాదిగలు అని చెప్పుకోవడానికి సంకోచించిన జాతిని దేశ అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ వరించడం మాదిగల మీద ప్రభుత్వాలకు ఉన్న ప్రేమను తెలియజేసిందన్నారు. మంద కృష్ణ మాదిగతోపాటు యావత్ మాదిగ జాతికీ దక్కిన గౌరవం అని కొనియాడారు. నూతనంగా ఎన్నుకునే గ్రామ కమిటీలు పూర్తి స్థాయిలో మాదిగల సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ ఇంకొల్లు మండల ఇన్‌చార్జ్‌గా ఒలేరు సూర్యను ఎన్నుకున్నారు. ఒలేరు బూసు, ఐజాక్, ఎంఎస్‌పీ ఇంకొల్లు మండల ఇన్‌చార్జ్ గాలి బాటసారి, గిద్యాన్, బాగ్యారావు, జగదీష్ పాల్గొన్నారు.

మినీ ఉద్యానవనం ప్రారంభం


ఉద్యానవనాన్ని ప్రారంభిస్తున్న వీరయ్య

అద్దంకి: పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డు లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం సమీపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.2.30 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ ఉద్యానవనాన్ని బుధవారం ప్రారంభించారు. దీనికి «శ్రీ చదలవాడ మోహనరావు- శ్రీధర కుమారి» గార్ల స్మారక మినీ ఉద్యాన వనంగా నామకరణం చేశారు. చదలవాడ ఫణీంద్ర బాబు, 6 వ వార్డ్ కౌన్సిలర్ కంపా రజని, రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, కోట అంజమ్మ, బార్ అసోసియేషన్ కార్యదర్శి గృహ లక్ష్మి, కొల్లి సురేంద్ర పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

10 లోపు నూర్ బాషా జిల్లా కమిటీ ఎంపిక


సమావేశమైన సభ్యులు

అద్దంకి: వచ్చే నెల పదో తేదీ లోపుగా నూర్ బాషా జిల్లా కమిటీ నియమించనున్నట్లు రాష్ట్ర నూర్ బాషా సంఘ ఆర్గనైజర్ సెక్రటరీ ఆవూద్ అన్నారు. పట్టణంలోని భవాని సెంటర్‌లోబ్రహ్మం గారి గుడి వద్ద నూర్ బాషా దూదేకుల సంఘ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర నూర్ బాషా దూదేకుల ఆర్గనైజర్ సెక్రెటరీ దావూద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకి అంటే తమకు అభిమానం అన్నారు. బాపట్ల జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ముందుగా అద్దంకిలోనే పర్యటన నిర్వహిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు. షేక్ షాజహాన్, కొటికలపూడి శ్రీను, సుభాని, అహమ్మద్, మాబు, వేల్పూరి మస్తాన్, దావల్, మీరా సాహెబ్, షైక్ శ్రీను, వేల్పూరి మౌలాగా సాహెబ్, షైక్ సైదులు, జుజు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


ఉప్పటూరులో అవగాహన కలిగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్


వేటపాలెం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ ఝాన్సి


కారంచేడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కారంచేడు: నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. సామ్రాజ్యం అన్నారు. బుధవారం కారంచేడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన «నిషా ముక్త భారత్» అభియాన్ కార్యక్రమంలో భాగంగా కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాలతో పాటు, సిగరెట్, ఆల్కహాల్, జూదం వంటి అనేక విషయాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు, వ్యసనాలకు అలవాటు పడిన అనేక మంది జీవితంలో ఓడిపోయి తమ ప్రాణాలను సైతం కోల్పోతున్న సంఘటనలు మనం గమనిస్తున్నామన్నారు. ఈ వయస్సులో ఆకర్షణలకు లోనుకాకుండా చక్కగా చదువుకొని మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని కోరారు.

వేటపాలెం: మత్తు పదార్థాలకు బానిసలైన వారికి జీవితాలు వ్యర్థమవుతాయని సీడీపీఓ డి. ఝాన్సి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక బీబీహెచ్ జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల్లో మత్తు పదార్థాలు వాడకూడదని వాటి వల్ల కలిగే అనార్థలన పై విద్యార్థులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు మద్దతుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు రహిత, ఆరోగ్యవంతమైన బలమైన భారత్ నిర్మించేందుకు యువత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. జీవితానికి హాయ్ చెప్పండి, మత్తు పదార్థాలకు నో చెప్పండి అని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఆత్మ గౌరవంతో, బాధ్యతతో, నిజాయితీతో జీవించేందుకు కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు డి. సరోజిని, కమిటీ సభ్యులు బట్టా మోహన్‌రావు, సుబ్బారావు, సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి, పీడీ బి. బాపయ్య శెట్టి, దేవ బిక్షం, పాల్గొన్నారు.

ఉప్పుటూరు(చినగంజాం): మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే మనిషి తన బంగారు జీవితాన్ని కోల్పోవడమేనని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి, కొకైన్, మార్ఫిన్, కోడిన్ లాంటి వాటినే మాదక ద్రవ్యాలంటారని వీటిని సేవించడం లేదా అక్రమంగా రవాణా చేయడం రెండు చట్టరీత్యా నేరమన్నారు.

పర్చూరు(చినగంజాం): మాదక ద్రవ్యాల వాడకంతో నిండు జీవితాలను బలి చేసుకోవద్దని పర్చూరు బీపీ ఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శేష కుమారి అన్నారు. అంగన్‌వాడీ సీడీపీఓ మాట్లాడుతూ విద్యార్థిగా ప్రతి ఒక్కరు చదువుపై ఏకాగ్రత ఉండాలన్నారు. సూపర్‌వైజర్ పి. దీపాదేవి, జీఎంఎస్‌కే కార్యకర్తలు పాల్గొన్నారు.

జె.పంగులూరు: పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి, సూపర్ వైజర్ ఏ. జయప్రద, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సీఎం వైఎస్ జగన్‌ని కలిసిన గాదె


వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడుతున్న గాదె

పర్చూరు(చినగంజాం): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన జగన్‌మోహన్ రెడ్డితో పర్చూరు నియోజక వర్గ పరిస్థితులపై చర్చించారు.

మహిళా డిగ్రీ కాలేజీలో సంవిధాన్ హత్యా దివస్

చీరాల అర్బన్: పట్టణంలోని యార్లగడ్డ అన్నపూర్ణాంబ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం సంవిధాన్ హత్యా దివస్ కార్యక్రమాన్ని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎస్.సాయి ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవిధాన్ హత్యా దివస్‌గా కేంద్ర ప్రభుత్వం జూన్ 25వ తేదీన ప్రకటించిందన్నారు. 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితి అత్యవసర పరిస్థితి విధించిన సందర్భంగా ప్రజాస్వామ్య విలువలని కాపాడటానికి 21 నెలల పాటు ఎందరో జైలు పాలయ్యారన్నారు. వారి త్యాగాలను, ప్రజాస్వామ్యంలో హక్కుల విలువలను గుర్తు చేసుకోవడానికి జూన్ 25న సంవిధాన్ హత్యా దివస్‌గా ప్రకటించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జీపీఆర్ నీలాకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పని చేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేసి.. నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఓటీసీలపై పలు సూచనలు అందించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

60 మందికి లేట్ బర్త్ సర్టిఫికెట్‌లు


లేట్ బర్త్ సర్టిఫికెట్‌ల కోసం పీహెచ్‌సీ వద్దకు వచ్చిన గిరిజనులు

చినగంజాం: మండలంలో ఆధార్ కార్డులు లేని 60 మంది గిరిజనులకు లేట్ బర్త్ సర్టిఫికెట్‌లను చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి. సాయి శ్రీ చరణ్, డాక్టర్ సీహెచ్ సిరివెన్నెల బుధవారం జారీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర యానాది మహానాడు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో ఆధార్ కార్డు లేని గిరిజనులను గుర్తించి వారికి ఆధార్‌ను ఎన్‌రోల్‌మెంట్ చేసేందుకు బర్త్ సర్టిఫికేట్ ముఖ్యం కావడంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అందుకోసం అవసరమైన ఆధారాలను సేకరించి వైద్యుల ద్వారా బర్త్ సర్టిఫికేట్‌లను జారీ చేయించారు.

ఎమర్జెన్సీకి 50 ఏళ్లు

చీరాల రూరల్: అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1975లో ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీకి (చీకటి రోజులకు) నేటితో 50 ఏళ్లు పూర్తయ్యాయని ఊరూర జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద మంకెన మణిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేటి ప్రజాస్వామ్యంలో అనేక లోటుపాట్లున్నాయని ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రజాస్వామ్యం ఈ మూడు అంశాలు ఎంతో అవసరమని, ఈ మూడు కలిస్తేనే నిజమైన ప్రజాస్వామ్యమని చెప్పారు.